ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 8 సెప్టెంబరు 2025



నిండుకుండలా గండికోట



గండికోట ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

కొండాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గండికోట జలాశయం నిండుకుండలా దర్శనమిస్తోంది. శ్రీశైలం నుంచి వస్తున్న కృష్ణా జలాలతో పాటు, వరద నీరు గండికోట ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండడంతో గండికోట ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో ఉంది. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం 24.048 టీఎంసీలకు చేరినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 5 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఆదివారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 9 వేల క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 9 వేల క్యూసెక్కులు ఉందన్నారు. ప్రాజెక్టులోకి 600 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరినట్లు ఈఈ తెలిపారు. కాగా సీబీఆర్‌కు వెయ్యి క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు అని తెలిపారు.

ఆలయాల మూసివేత





మూసివేసిన దేవునికడప ఆలయం, ఒంటిమిట్ట కోదండరామాలయం

కడప కల్చరల్/చక్రాయపేట/ఒంటిమిట్ట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 2600 ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచే మూసివేసినట్లు జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవునికడప ఆలయం, ఒంటిమిట్ట కోదండరామాలయం, గండి ఆంజనేయస్వామి ఆలయాలనూ మూసివేసినట్లు తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయశుద్ధి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించవలసిందిగా కోరారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ : డీఆర్వో

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సోమవారం కలెక్టరేట్ సభా భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9-30 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్, 10 నుంచి మధ్యాహ్నం వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి పరిష్కారమైందా ? లేదా ? అనే విషయాలను తెలుసుకొనేందుకు 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో కోరారు.

వైభవంగా కోదండరాముడి పౌర్ణమి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రామాలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం నయనానందకరంగా జరిగింది. ముందుగా ఆలయ అర్చకులు శ్రావణ్‌కుమార్, పవన్‌కుమార్, వీణరాఘవాచార్యులు, మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణవేదికపై ఆశీనులు చేశారు. పూజల అనంతరం జీలకర్ర బెల్లం పెట్టి అనంతరం మాంగల్యధారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


ముక్తిరామలింగేశ్వరా.. ఆక్రమణలు కనవేమిరా..!



శిథిలావస్థకు చేరిన ఆలయ రాజగోపురం

దేశంలోనే దక్షిణకాశీగా పేరుగాంచిన ప్రొద్దుటూరు ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కోట్ల విలువైన ఆలయ భూములు, స్థలాలు దశాబ్దాలుగా ఆక్రమణదారుల స్వాధీనంలో ఉండడంతో ఆలయ ఆస్తులకు భారీ గండిపడింది. సాగుభూముల లీజుల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. నేటి మార్కెట్ ధర ప్రకారం రూ.500 కోట్లకు పైగా విలువ చేసే ఈ ఆస్తులను క్రయ, విక్రయాలు చేసినా దేవదాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వందల కోట్ల ఆస్తులున్నా ఆలయం అభివృద్ధికి నోచుకోకపోవడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

- 9.04 ఎకరాల్లో రూ.180 కోట్ల విలువైన ఇంటి స్థలాలు కబ్జా
- ఆలయ భూముల్లో వందలాది అక్రమ కట్టడాలు
- దశాబ్దాలుగా ఆక్రమణదారుల స్వాధీనంలోనే
- కోట్లలో ఆలయ ఆస్తుల క్రయ, విక్రయాలు
- నోటీసులు ఇచ్చి.. చర్యలు మరిచి
- కోట్ల ఆస్తులున్నా ఆలయ అభివృద్ధికి నిధులు కరువు
- పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు



12 ఏళ్లుగా వేలంపాటలు నిర్వహించని గడ్డికయ్యల భూములు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయానికి ప్రొద్దుటూరు పట్టణంలో ప్రధాన ప్రాంతాలైన వసంతపేట, సాయిబాబా కొట్టాలలో 2.99 ఎకరాలు, వసంతపేట నుంచి ఈశ్వర్‌రెడ్డినగర్‌కు వెళ్లే దారిలో రవీంద్రస్కూలు వున్న స్థలాలు 0.32 సెంట్లు, హనుమాన్‌నగర్‌లో 1.81 ఎకరాలు, సూపర్‌బజార్ నాలుగురోడ్లలో రిషి అపార్ట్‌మెంటు నుంచి ఆదిత్య స్కూలు వరకు ఎదురుగా వున్న 1.48 ఎకరాలు, శ్రీరాంనగర్‌లో 2.44 ఎకరాలు మొత్తం కలిపి 9.04 ఎకరాలు అన్యాక్రాంతమైంది. ఈ స్థలాల్లో 380కి పైగా భవనాలు, ఇళ్లు, వాణిజ్య గదులు నిర్మించుకున్నారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ స్థలాల విలువ సుమారు రూ.180 కోట్ల మేర వుంటుందని అధికారుల అంచనా. వీటితో పాటు ఆలయ ఆస్తులన్నీ కలిపి సుమారు రూ.500 కోట్లు ఉన్నా ఆలయ సిబ్బందికి నెలనెల జీత భత్యాలు, కరెంటు బిల్లులు, స్వామివారికి దూపదీప నైవేద్య ఖర్చులు సైతం చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఆలయంలో ప్రస్తుతం ముగ్గురు అర్చకులు, ముగ్గురు స్వీపర్లు, ఇద్దరు నైట్ వాచ్‌మెన్లు ఉన్నారు.



పుట్టవీధిలోని ఆలయ భూముల్లో నిర్మించిన భారీ భవంతులు

కోట్లలో క్రయ విక్రయాలు

వసంతపేట మెయిన్‌రోడ్డు, సాయిబాబాకొట్టాల, ఈశ్వరరెడ్డినగర్ వెళ్లే దారిలో రాఘవేంద్ర స్వామి గుడి సమీపంలోని పుట్టవీధిలో, సూపర్‌బజార్ నాలుగురోడ్ల నుంచి బొల్లవరం వెళ్లే మెయిన్ రోడ్డుకు ఆనుకోని వుండే ఈ స్థలాలు, దొరసానిపల్లె మెయిన్ రోడ్డుకు వుండే శ్రీరాంనగర్ స్థలాలకు సెంటు 20 లక్షల మేర మార్కెట్ విలువ వుంది. ఇందులో చాలా చోట్ల మెయిన్‌రోడ్లకు వుండటం వలన కమర్షియల్ షాపురూములు, పెద్ద భవనాలు ఇళ్లు నిర్మించుకున్నారు. వీటిని వేరే సర్వే నెంబర్లు వేసి విక్రయించి కొందరు అక్రమార్కులు కోట్లలో సొమ్ము చేసుకున్నారు. కొందరు అద్దెలకు ఇచ్చుకొని లక్షల ఆదాయం గడిస్తున్నారు. కానీ ఇన్ని కోట్ల విలువైన ఆస్తులపై నోటీసులు ఇవ్వడం తప్ప ఎటువంటి ఆక్రమణ తొలగింపు చర్యలు దేవదాయ అధికారులు తీసుకోలేదు.

సాగు భూముల లీజుల్లోనూ అక్రమాలు

ముక్తి రామలింగేశ్వర ఆలయానికి చెందిన 27.29 ఎకరాల సాగు భూములు రెండు కొళాయిలకు వెళ్లే దారిలోని నీళ్ల ట్యాంకుల వెనక వున్నాయి. ఈ భూములకు 2012లో లీజువేలం నిర్వహించారు. 21 మంది రైతులకు మూడేళ్లకు లీజుకు ఇచ్చారు. నాడు 27.29 ఎకరాలకు 21 మంది రైతులు కలిపి ఏడాదికి రూ.1,35,300 గుత్త చెల్లించేవారు. ఈ భూములు చేసుకుంటున్న రైతులు తాము భూమిలేని వారమని ఈ భూములు తమకు ఇవ్వాలని 2012లో హైకోర్టులో కేసులు వేశారు. దీంతో అప్పటి నుంచి ఈ భూములకు వేలంపాటలు నిర్వహించకపోవడంతో ఇప్పటికీ అదే గుత్తను చెల్లిస్తున్నారు. దీంతో కోట్ల రూపాయల ఆదాయం దేవదాయశాఖ కోల్పోయింది. అలాగే సోములవారి పల్లెలో 39.84 ఎకరాలు, జమ్మలమడుగు నియోజకవర్గంలోని దేవగుడిలో 23.64 ఎకరాలకు అత్యల్పంగా గుత్త చెల్లిస్తున్నారు.

సీఎం దృష్టి సారించేనా !

రూ.500 కోట్ల విలువైన ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమై ఆలయ ఆదాయానికి తీవ్రంగా గండి పడుతోంది. ఈ భూములను కబ్జాదారుల నుంచి కాపాడి వీటి ద్వారా వచ్చే ఆదాయంతో టెంపుల్ టూరిజంను అభివృద్ధి పరచాలని ఆ దిశగా సీఎం చంద్రబాబు కూటమి ప్రజా ఎమ్మెల్యేలు, ఎంపీలు కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు. అలాగే ఆలయ ప్రాచీన కట్టడాలకు నిర్వహణ మరమ్మతులకు ప్రభుత్వాల నుంచి పైసా నిధులు మంజూరు కావడం లేదని, ఇటీవల ఆలయ గాలిగోపురంపై వున్న కలశాలు కింద పడిపోయి దెబ్బతిన్నాయని, వాటిని తిరిగి ప్రతిష్ఠించాలని కోరుతున్నారు.

స్థలపురాణం

సాక్షాత్తు శ్రీరామ చంద్రుడే ఇక్కడ సైకతలింగాన్ని ప్రతిష్ఠించారని, పొద్దుపొడవక ముందే ఈ లింగప్రతిష్ఠ చేయడం వలన ప్రొద్దుటూరు అనే పేరు వచ్చినట్లు స్థల పురాణం చెబుతోంది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆలయ గాలిగోపురం నిర్మించినట్లు శిలాశాసనాలను బట్టి తెలుస్తోంది. ఆదిశంకరాచార్యుడు శ్రీచక్ర యంత్రం ప్రతిష్ఠించడంతోనే ఈ పట్టణం వ్యాపార వాణిజ్యపురిగా విరాజిల్లుతున్నదని ప్రాశస్తి.

చట్టపరమైన చర్యలు చేపడతాం

ఆలయానికి చెందిన పట్టణంలోని పలు ప్రాంతాల్లో 9.04 ఎకరాల్లో దాదాపు 380కి పైగా నిర్మించిన కట్టడాలకు నోటీసులు గతంలోనే ఇచ్చాం. గడ్డికయ్యలకు ఏప్రిల్‌లో వేలంపాటల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. కానీ కోర్టులో కేసులు నడుస్తుండగా వేలంపాటలు ఎలా నిర్వహిస్తారని ఆ భూములు సాగుచేసుకుంటున్న రైతులు అడ్డుకున్నారు. కోర్టులో కేసులు క్లియర్ చేసి గడ్డి కయ్యల భూములకు వేలం పాటలు నిర్వహించి ఆలయానికి ఆదాయం పెంచుతాం. గడ్డి కయ్యల వారు పంపే తక్కువ లీజు నిరాకరిస్తున్నాం.

- శ్రీధర్, ఈఓ,
ముక్తిరామలింగేశ్వస్వామి ఆలయం

ఆకాశంలో అద్భుతం

- కడపలో చంద్రగ్రహణం దృశ్యాలు



ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- రౌడీషీటరుపై కేసు నమోదు

కడప క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో ఐదేళ్ల చిన్నారి ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చి ఆడుకుంటుండేది. సదరు ప్రాంతానికి చెందిన రౌడీషీటరు రాజ్‌కుమార్ ఆ పాపకు చాక్లెట్ ఇచ్చి ఎత్తుకుని తన ఇంటికి తీసుకువచ్చాడు. అప్పటికే పాప కనిపించకపోవడంతో ఆ చిన్నారి తల్లి పాపకోసం వెతుకుతుండగా రాజ్‌కుమార్ పాపను తీసుకెళ్లాడని స్థానికులు చెప్పడంతో ఆమె అతని ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో నిందితుడు పాపతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా బాలిక తల్లి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆ రౌడీషీటరుకు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి, తాలుకా సీఐ రెడ్డప్ప, ఎస్ఐ తులసి నాగప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

మైలవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దన్నవాడ గ్రామానికి చెందిన మద్దిరాల చెన్నప్ప (52) అనే రైతు అప్పుల బాధ తాళలేక పొలం సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తలమంచి పట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. వ్యవసాయానికి చేసిన అప్పులు, రెండేళ్ల క్రితం కుమార్తె పెళ్లికి చేసిన అప్పులు, రెండు నెలల క్రితం ఎకరా పొలంలో వరి నాట్లు వేయగా మొలకెత్తకపోవడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్ఐ తెలిపారు. ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడిపోయి ఉండడంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య ఎలీశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడికి దాదాపు రూ.10 లక్షలకు పైగా అప్పులు ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

కనుల పండువగా తేరు ఊరేగింపు

- ఘనంగా ఆరోగ్యమాత తిరుణాల మహోత్సవం



నగరంలో ఊరేగింపుగా వస్తున్న ఆరోగ్య మాత



కిటకిటలాడిన విశ్వాసులు

కడపకల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడపరైల్వేస్టేషన్ సమీపంలో వెలసిన ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం తిరుణాల మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి నగర మరియాపురం నుంచి ఆరోగ్యమాత తేరును కనులపండువగా ఊరేగింపు నిర్వహించారు. మరియాపురం నుంచి నగర పురవీధుల గుండా రెండో గాంధీబొమ్మ, వైవీస్ట్రీట్ సర్కిల్, పొట్టిశ్రీరాములు సర్కిల్, క్రిష్టియన్ లైన్, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, సంధ్యాసర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్ నుంచి ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమాత సభ సిస్టర్స్ భక్తిగీతాలు ఆలపించారు. వల్లూరు విచారణ గురువులు కారు శరత్, విచారణ యూత్, ఆరోగ్యమాత తిరుణాల కమిటీ సభ్యులు ఊరేగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం రాత్రి ఆరోగ్యమాత యువత ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తిగీతాలు ఆలపించారు. రాత్రి 12 గంటలకు ఏసు కృప భక్తి రసనాటకం ప్రదర్శించారు. కాగా ఊరేగింపు కార్యక్రమానికి ముందుగా నగర మరియాపురం సెయింట్ మేరీస్ కేథడ్రిల్ చర్చిలో విచారణ గురువులు దివ్య బలిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు, విశ్వాసులు, ప్రజలు పాల్గొన్నారు.

చీనీ రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి



అయ్యవారిపల్లెలో చీనీకాయలను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక, కొనేవారు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చీనీ రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలోని చీనీ తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో వ్యవసాయం దండగ అనే పరిస్థితి వచ్చిందన్నారు. పంట పండించడం ఒక ఎత్తైతే దాన్ని అమ్ముకోవడం మరొక ఎత్తు అయిందన్నారు. చీనీ, మామిడి, ఉల్లి, పొగాకు, మిరప, టమోట ఇలా ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, అసలు పంట కొనేందుకు ఎవరూ రావడం లేదని ఆవేదన చెందారు. నియోజకవర్గంలో ప్రధాన చీనీ పంట, ప్రస్తుతం టన్ను రూ.5 నుంచి రూ.10 వేల లోపు పలుకుతోందన్నారు. ఈ ధర రైతుకు గిట్టుబాటు కాకపోవడంతో చీనీకాయలను అలాగే చెట్టుకు వదిలేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం టన్నుకు రూ.50 వేలతో చీనీకాయలను కొనాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, వేంపల్లె మండల అధ్యక్షుడు రామకృష్ణ, చక్రాయపేట అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, బద్రి, ఉత్తన్న, వేమయ్య, రమణ, ఫయాజ్, అడిక్, చీనీరైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన ఖాదర్ హుసేన్

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగి కలసపాడుకు చెందిన షేక్ ఖాదర్‌హుసేన్(53) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కలసపాడుకు చెందిన షేక్ ఖాదర్ హుసేన్ డీసీసీ బ్యాంకులో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పనిమీద కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక కడప-కర్నూల్ జాతీయ రహదారిలో మైదుకూరు బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు దాటుతుండగా స్కార్పియో ఢీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఓ బ్రాందీషాపు ఎదురుగా శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఏపీ39ఏజెడ్8379 స్కార్పియో వాహనం ముద్దనూరు వైపు నుంచి బయల్దేరింది. మద్యం షాపు ఎదురుగా అందులో పనిచేస్తున్న గుమస్తా గురుసాయినందన్ అనే యువకుడు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన స్కార్పియో ఢీకొంది. ఈ ఘటనలో యువకుడికి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

నవ వధువు అనుమానాస్పద మృతి


వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దారు, ఎస్ఐ

చిట్వేలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 9నెలల క్రితం ఏడడుగులు నడిచిన నవ వధువు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చిట్వేలి మండలంలో చోటు చేసుకుంది. ఎస్టీ కాలనీకి చెందిన దాసరి ప్రశాంతి(25) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఆదివారం ఉదయం చిట్వేలి పోలీసులకు ఫిర్యాదు అందింది. నెల్లూరు టౌను గిరిజన కాలనీకి చెందిన ప్రశాంతిని అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం నేతివారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన రాజేష్‌తో 9 నెలల క్రితం వివాహమైంది. తర్వాత కొంతకాలం నుంచి కుటుంబంలో కలహాలు రావడంతో అత్తారింటి వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన ప్రశాంతి ఉరి వేసుకుని మృతి చెందినట్లు మృతురాలి తండ్రి దాసరి రమేశ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టపాసులు పేలి ఇరువురికి గాయాలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం దిగువ ఇందుకూరుపల్లిలో జరిగిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమంలో టపాసులు పేలుస్తుండగా ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న శివవంకర్, మనోజ్ అనే ఇద్దరు యువకుల కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు హుటాహుటిన గ్రామానికి చేరుకొని అంబులెన్స్‌ను పిలిపించి గాయపడిన వారిని అంబులెన్స్‌లో రాయచోటి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుగవాసి ప్రసాద్‌బాబు బాధితులను పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

● కాలిపోయిన ఇల్లు


కాలిపోయిన ఇంట్లోని వస్తువులు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో నివాసం ఉంటున్న కంచర్ల ఆంజనేయులు ఇంట్లో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వలన ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిద అయ్యాయి. ఆంజనేయులు ప్రొద్దుటూరు రోడ్డులో ల్యాండ్రీ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కూడా ల్యాండ్రీ షాపు వద్ద పనులు చేసుకొంటుండగా ఉన్నట్లుండి ఇంట్లో మంటలు, పొగలు రావడంతో ఇంటి పక్కన వారు ఆంజనేయులుకు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఇళ్లంతా కాలిబూడిదయిందని వాపోయాడు. ఆంజనేయులు కుటుంబం కట్టు బట్టలతో మిగిలారు. ప్రభుత్వం నుంచి సాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో శనివారం పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించిన ఎస్ఐ చిరంజీవి పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేయగా, మరి కొంతమంది తప్పించుకొని పారిపోయారని తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు రూ.1.57 లక్షలను స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ తెలిపారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సిద్దవటం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాజంపేట గ్రామ సమీపంలో శనివారం రాత్రి వంతాటిపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అతని వద్ద 65 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. పట్టుబడ్డ మద్యం విలువ రూ.10 వేలు ఉంటుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైరు చోరీ

బి.కోడూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామంలో రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును దొంగలు దోచుకెళ్తున్నారు. శనివారం రాత్రి ఆ గ్రామానికి చెందిన రైతులు రమణయ్య, లక్కిరెడ్డి సుబ్బారెడ్డికి చెందిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును దొంగలించారు. మండలంలో అన్ని గ్రామాలు ఒక ఎత్తయితే, పాయలకుంట్ల గ్రామం దొంగలకు టార్గెట్‌గా మారింది. ఎక్కువగా ఆ గ్రామం ఇళ్లల్లో చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల రైతు ఇంటి వద్ద ఉన్న ఆవును దొంగలు ఆటోలో తీసుకెళ్లారు. అంతేకాక అదే గ్రామంలో నాలుగు గుళ్లల్లో హుండీ దొంగతనం జరిగింది. ఇప్పటికే దాదాపు 20 ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఈ గ్రామంపైన పోలీసు అధికారులు గట్టి నిఘా పెట్టి దొంగలను పట్టుకుంటే తప్ప మరిన్ని దొంగతనాలు జరిగే ప్రమాదం ఉన్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పొలానికి నీళ్లు కట్టుకునేందుకు వీలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, అందులోని రాగివైర్లు, మోటర్ల వద్ద ఉన్న రాగి కేబుల్, స్టాటర్లను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు దొంగలను పట్టుకోవాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన అవసరం



అరుణ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. విధుల్లో భాగంగా రోజులో ఎక్కువ సేపు కంప్యూటర్ లేదా ల్యాప్‌ట్యాప్‌పై పనిచేస్తుంటాడు. దీంతో అతని మెడ, వెన్నులో నొప్పి మొదలైంది. ఆసుపత్రికెళితే మందులిచ్చారు. అయినా ఫలితం లేకపోయింది. కానీ ఫిజియోథెరపీ ద్వారా ఉపశమనం పొందగలిగాడు.

రామారావుకు 50సంవత్సరాలు. ఈ మధ్య మోకాళ్ల నొప్పులు ఎక్కువ కావడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. అనంతరం మోకాళ్లు యథాస్థానానికి, కీళ్ల కదలికలకు ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడింది.

మారిన జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం, కంప్యూటర్ల ముందు ఎక్కువసేపు కూర్చోవడం వంటి కారణాలతో అనేకమంది యువత, పెద్దలు కీళ్లనొప్పులు, వెన్నునొప్పి, మెడనొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి సమస్యలకు మందులు లేకుండా ఫిజియోథెరపీ ద్వారా చికిత్స అందించి, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఫిజియోథెరపిస్ట్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు.



నేడు ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబరు 8న ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంగా జరుపుకొంటారు. ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం.


సర్వజన ఆసుపత్రిలో ఫిజియోథెరపీ సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనంలో ఫిజియోథెరపీ అవసరం రోజురోజుకూ పెరుగుతోంది. పుట్టుకతో వచ్చే వైకల్యాలు, ప్రమాదాల వల్ల కలిగే గాయాలు, పక్షవాతం, మానసిక ఒత్తిడి వంటి అనేక ఆరోగ్య సమస్యలకు ఫిజియోథెరపీ అద్భుతమైన చికిత్సగా నిలుస్తోంది. వ్యాయామాల ద్వారా, చేతితో చేసే చికిత్సల ద్వారా శారీరక కదలికలను మెరుగుపరిచి, నొప్పిని తగ్గించి, జీవిత నాణ్యతను పెంచడంలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తోంది.

పీడియాట్రిక్ ఫిజియోథెరపీ

పిల్లల భవిష్యత్తు కోసం పిల్లల ఆరోగ్యానికి పీడియాట్రిక్ ఫిజియోథెరపీ ఎంతో అవసరం. పుట్టినప్పటి నుంచి వచ్చే కండరాల బలహీనత, శరీర భాగాల కదలికలో సమస్యలు, మెదడు పక్షవాతం వంటి సమస్యలకు ఈ చికిత్స చాలా ఉపయోగపడుతుంది. ఫిజియోథెరపిస్టులు వ్యాయామాల ద్వారా పిల్లలు సాధారణ జీవితం గడపడానికి, స్కూల్‌కు వెళ్లడానికి, ఆత్మవిశ్వాసంతో ఉండడానికి ఈ చికిత్స దోహదపడుతుంది.

ఫిజియోథెరపీలో మహిళలకు..

గర్భధారణ, ప్రసవం, రుతుక్రమం వంటి సందర్భాల్లో మహిళలు ఎదుర్కొనే శారీరక సమస్యలకు ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుంది. సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మహిళలు ఈ చికిత్సను ఉపయోగించుకోవడం లేదు. ఫిజియోథెరపీ ద్వారా ఈ సమస్యలను అధిగమించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చు. వైద్యులు, ఫిజియోథెరపీ నిపుణులు ఫిజియోథెరపీని ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిపై అవగాహన కల్పించడానికి ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. మందులపై ఆధారపడకుండా ఫిజియోథెరపీ చికిత్సను స్వీకరించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో..

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఫిజియోథెరపీ విభాగంలో ప్రతిరోజు సుమారు 70 నుంచి 80 మంది పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. ఇక్కడ ఫిజియోథెరపీ సంబంధంగా పీడియాట్రిక్స్, జెనియాట్రిక్స్, ఎలక్ట్రోథెరపీ, ఎక్సర్‌సైజ్‌థెరపీ పరికరాలతో విద్యార్థులు, ట్రైనీ డాక్టర్లతో పక్షవాతం, కీళ్లనొప్పులు, పోస్ట్ ఆప్, ఆర్థో సర్జరీస్‌లకు, ఎముకలు, నరాల సంబంధ మరెన్నో వ్యాధులకు ఇక్కడి ఫిజియోథెరపీ విభాగంలో చికిత్స పొందుతున్నారు.

అన్ని వసతులతో అందుబాటులోకి..



ప్రజలు ఇక్కడ ప్రత్యేకంగా ఆర్థో, న్యూరో, కార్డియో, పీడియాట్రిక్స్ సర్జరీస్ భాగాలకు, తదితర విభాగాలకు ఫిజియోథెరపీ చికిత్స చేయడం జరుగుతుంది. ఇక్కడ ప్రత్యేకంగా నూతన లేజర్, యూఆర్ థెరపీ ద్వారా పిల్లల నుంచి పెద్దల వరకు చికిత్స ఇవ్వడం జరుగుతుంది. ఇక్కడ ముగ్గురు ఫిజియోథెరపిస్టులు, 30 మంది ఇంటర్న్‌ల ద్వారా చికిత్సలు అందిస్తున్నారు. నూతన పరికరాలతో, ప్రక్రియలతో ఫిజియోథెరపీలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. అన్ని వసతులతో ఫిజియోథెరపీ విభాగం అందుబాటులో ఉంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ సంపత్, ఫిజియోథెరపీ విభాగం హెచ్‌వోడీ, కడప సర్వజన ఆసుపత్రి

అన్నమయ్య జిల్లాను అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం



● విద్య, వైద్య, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
● ఆంధ్రజ్యోతితో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

రాజంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేశంలో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఉమ్మడి కడప జిల్లా ఉందని, దేశవ్యాప్తంగా 112 జిల్లాలు వెనుకబడి ఉండగా ఉమ్మడి కడప జిల్లాలోని అన్నమయ్య జిల్లా అన్నిరంగాల్లో వెనుకబడి ఉందని, దీనిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి జిల్లా అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నట్లు రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ వెల్లడించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా అన్నమయ్య జిల్లాలో పర్యటిస్తున్న ఆయన ఆదివారం రాజంపేటలో ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి అడిగిన కొన్ని ప్రశ్నలకు స్పష్టమైన తమ శాఖ విధానాలను వెల్లడించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అభివృద్ధిపరంగా వెనుకబడి ఉన్న 112 జిల్లాలను గుర్తించిందని, వీటిలో ఉమ్మడి కడప జిల్లా ఉండగా అందులో అత్యంత వెనుకబడిన స్థితిలో అన్నమయ్య జిల్లా ఉందని, వీటిని కేంద్ర ప్రభుత్వం ఆకాంక్షిత జిల్లాల జాబితాలో గుర్తించి ఈ ప్రాంతాన్ని సమగ్ర అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను సమన్వయపరుస్తూ ఆ పథకాలు పూర్తిగా అమలయ్యేటట్లు వాటి ఫలితాలు ప్రజలకు చేరువయ్యేటట్లు అటు సంక్షేమాన్ని ఇటు అభివృద్ధిని ప్రజలకు చేరవేసి అభివృద్ధి పరచడమే తమ 20 సూత్రాల అమలు కమిటీ బాధ్యత అన్నారు. ఇందులో భాగంగా తాము ఇప్పటికే రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పర్యటించి ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల పనితీరుపై పూర్తిస్థాయిలో సమీక్షలు చేశామని తెలిపారు.

అన్నమయ్య జిల్లాలో రెండుసార్లు పర్యటించి కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న పథకాల గురించి అధ్యయనం చేశామని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో గత వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలను వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. ఏ శాఖ అధికారిని ఆ శాఖ పనిని చేయనివ్వకుండా నిధులను వారికి ఇష్టమొచ్చినట్లు మళ్లించి భారీ ఎత్తున నిధులు దుర్వినియోగం చేశారన్నారు. అన్ని శాఖల్లో అవినీతి పేరుకుపోయిందన్నారు. అన్ని శాఖలు నిర్వీర్యమై అధికారులు నామమాత్రంగా తయారయ్యారన్నారు. విషయాన్ని తాము గుర్తెరిగి అన్నిశాఖల అధికారులను సమన్వయపరిచి తిరిగి వాటిని గాడిన పెడుతున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో భారీ ఎత్తున భూఆక్రమణలు జరిగాయని, రికార్డులు తారుమారు చేశారని దీనిపై శాఖాపరంగా చర్యలు తీసుకుని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో పోషకాహారం సక్రమంగా అందని ప్రాంతాలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించడంతో పాటు ఆ ప్రాంతాల్లో విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరచడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాలు అనేకం గుర్తించామని, జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా వారికి ఇబ్బందులు లేకుండా చేయడానికి పనులు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఇటీవల అత్యంత వెనుకబడ్డ 500 బ్లాకులను గుర్తించామని, ఆ బ్లాకుల్లో ఉమ్మడి కడప జిల్లాలోని చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు ప్రాంతాలు కూడా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. రాజంపేట ప్రాంతంలో కూడా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తాము ప్రత్యేక నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. పీఎంశ్రీ పథకం కింద అన్నమయ్య జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ విద్యాలయాల్లో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఒకేచోట చదివే సదుపాయాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్య, విద్య, పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిపై తిరుపతిలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించి పథకాలను తెలియజేయనున్నట్లు తెలిపారు. ఒంటిమిట్ట, గండికోట ప్రాంతాలను ప్రముఖ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం చేస్తామని, ఒంటిమిట్ట ఆలయానికి అనుసంధానంగా దేవునికడప, భద్రాచలం, తిరుమల, శ్రీశైలం, చుట్టుపక్కల ఆలయాన్ని అనుసందానం చేసి ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి సూపర్-7 క్రికెట్ విజేత కడప జిల్లా జట్టు


ట్రోఫి అందుకున్న కడప జిల్లా జట్టు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సూపర్-7 క్రికెట్ పోటీ విజేతగా కడపజిల్లా జట్టు అవతరించింది. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో శని, ఆదివారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు 11జట్లు హాజరయ్యాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కడపజట్టు విజేతగా నిలువగా ఎన్టీఆర్‌జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. విజేతలకు ట్రోఫీతోపాటు మెడల్స్‌ను అందజేశారు. యూత్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు మార్తల సుధాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివారెడ్డి, టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్ పాల్గొన్నారు.

సమాజానికి సంపద సృష్టించి సేవలందించండి


సమావేశంలో పాల్గొన్న సింగారెడ్డి కీర్తిచంద్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ద్వారా సంపద సృష్టించి సమాజానికి సేవలందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యువ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. శనివారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎంటర్‌ప్రెన్యూర్ ఆర్గనైజేషన్‌కు చెందిన 45మంది యువ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఇందులో కడప జిల్లాకు చెందిన సింగారెడ్డి కీర్తిచంద్‌రెడ్డి, డాక్టర్ సింగారెడ్డి దివిజ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాలలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, యువ పారిశ్రామికవేత్తలు కొత్త రంగాల్లో అడుగుపెట్టి సత్తా చాటాలని ముఖ్యమంత్రి సూచించారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ భరత్, వివిధ ప్రాంతాల యువ పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక


జిల్లా స్థాయి జూనియర్ బాలికల జట్టుకు ఎంపికైన వారు

జమ్మలమడుగు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వైఎస్ఆర్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలను జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణమూర్తి, వెంకటరమణ హాజరై పూర్తి చేశారు. ఈ ఎంపికలకు అన్ని మండలాల నుంచి దాదాపు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12, 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా బచ్చలపల్లి మండలం రామాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సెలెక్షన్ కన్వీనర్ ఓబయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సెలక్షన్ కమిటీ మెంబర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా బాలుర జట్టు..: కె.కౌశిక్, ఎస్.మహమ్మద్‌బాబా (రాజంపేట), జె.హైడెన్, డి.రాజేష్, ఎస్.వెంకటేష్, ఎం.చిన్న ఓబులేసు (దూవ్వూరు), డి.షడ్రక్, డి.రఫేల్ (చిన్నగంగన్నపల్లె), ఎస్.మురళీరాజు (ఒంటిమిట్ట), ఎస్.షాజిద్ (రాజంపేట)

జిల్లా బాలికల జట్టు..: డి.కీర్తి, డి.నయోమి (చిన్నగంగన్నపల్లె), ఎం.స్వీటీ (ఎస్.ఉప్పలపాడు), జి.వర్షిణి (తాళ్లప్రొద్దుటూరు), ఎం.గౌతమి, జి.సునంద, కె.చర్లిన్, ఎస్.అశ్వని, ఎస్.లక్ష్మి (చియ్యపాడు)

ట్రాక్టర్ కిందపడి మహిళ మృతి

చిట్వేలి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేకే వడ్డిపల్లెకి చెందిన రాయని శాంతమ్మ(34) ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందింది. ఆ వివరాల్లోకి వెళితే.. శాంతమ్మ మరి కొంతమందితో కలసి కూలీపనుల నిమిత్తం ట్రాక్టర్‌లో ఎగువపల్లికి వెళ్లింది. పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వస్తుండగా కె.కందులవారిపల్లె గ్రామంలోకి వచ్చేసరికి అతివేగంగా వస్తున్న ట్రాక్టర్‌ను స్పీడ్ బ్రేకర్ వచ్చిందని డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో డ్రైవర్ పక్కనే కూర్చొని ఉన్న శాంతమ్మ ట్రాలీకి, ఇంజన్‌కు మధ్యలో పడటంతో ఆమెపై ట్రాలీ ఎక్కింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు కూలీలు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి మరిది సుబ్బరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేటకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అత్తపై అల్లుడు దాడి

నందలూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేబాక గ్రామ పంచాయతీ మరాటపల్లె గ్రామంలో అత్తపై అల్లుడు దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. నరసింహారావు అలియాస్ చిన్న భార్య మంజులాబాయి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌దేశాలకు వెళ్లింది. ఈక్రమంలో వారి ఇద్దరి పిల్లలను తల్లి పద్మావతిబాయి వద్ద ఉంచింది. ఆదివారం పిల్లలను తనతో పంపాలని అత్తతో గొడవకు దిగిన చిన్న కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెనుకంజలో చిత్తూరు, నెల్లూరు జట్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో మొదటి రోజైన ఆదివారం ప్రత్యర్థి జట్ల కన్నా చిత్తూరు, నెల్లూరు జట్లు వెనుకంజలో ఎదురీదుతున్నాయి.

ఏసీఏ మైదానంలో..: నగర రిమ్స్ సమీపంలో ఉన్న వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 50.5 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..: నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు 43.5 ఓవర్లలో 257 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 35.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది.

'అన్నదాత పోరు పేరుతో ఉనికి కోసం వైసీపీ డబ్బా వాగుడు'

కడప మారుతీనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతుల కష్టాలన్నీ గత వైసీపీ పాలనలో తీర్చినట్లు ఇప్పుడే కొత్తగా రైతులకు కష్టాలొచ్చినట్లుగా వాటిని ప్రస్తుతం అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం తీర్చలేదన్నట్లుగా ఈనెల 9న అన్నదాతపోరు పేరుతో వైసీపీ ఉనికి కోసం వైసీపీ నాయకులు డబ్బావాగుడుకు తెరతీయడం సరైందికాదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి జిలానీ బాష, సీనియర్ నాయకుడు జిలానీ బాష ధ్వజమెత్తారు. ఆ మేరకు ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాపితంగా యూరియా కొరత లేకపోయినా రైతులను గందరగోళానికి గురిచేసేలా అన్నదాత పోరంటూ మరో కొత్త ఎపిసోడ్‌కు తెరతీయడం దారుణమన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దేవునికడప ఆలయంలో మహాపూర్ణాహుతి



కడప కల్చరల్, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): పవిత్రోత్సవాలలో భాగంగా చివరి రోజైన ఆదివారం దేవునికడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సాగుతున్న స్వామివారి పవిత్రోత్సవాలలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పవిత్ర విసర్జనాలు, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అంతేకాకుండా స్వామివారికి కుంభ ప్రోక్షణ, పవిత్ర వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి సాయంత్రం 5 గంటలకు ఆలయంలో స్వామి, అమ్మవార్లను ఊరేగింపు చేశారు.

30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి, 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కడప యూనియన్ కార్యాలయ ఆవరణంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ బకాయిలను వెంటనే చెల్లించే ఏర్పాటుచేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కాంప్లెక్స్ స్థానాల్లో పనిచేస్తున్న గణిత,ఆంగ్ల ఉపాధ్యాయుల కు శాశ్వతస్థానాలు కేటాయించే ఏర్పాటుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, సుబ్బరాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, మీడియా ప్రముఖుడు బాలకృష్ణుడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె

పేరుకుపోతున్న చెత్తకుప్పలు

వేంపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీలో వేతనాలు ఇవ్వనందుకు నిరసనగా పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వలేదంటూ పనులు చేయకుండా కార్మికులు ఆందోళనకు దిగారు. వివిధ రకాలుగా నిరసనలు తెలుపుతున్నారు. అయినా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు పనులు చేయకపోవడంతో వేంపల్లె చెత్తమయంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే రోడ్లపైనే ఉంది. కుప్పలుకుప్పలుగా ప్రధాన రోడ్లతో పాటు వీధుల్లో చెత్త దర్శనమిస్తోంది. గాలులు వీచినపుడు పాదచారులు, వాహనదారులమీదకు వస్తోంది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకొని పారిశుధ్య కార్మికులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వేంపల్లె పట్టణంలో ప్రధాన రహదారిలో రోడ్డుపైనే చెత్త

నీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారానికి కృషి : జడ్పీటీసీ

పులివెందుల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కృషిచేస్తామని జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి అన్నారు. హంద్రీ నీవాకాల్వ నుంచి యర్రబల్లె చెరువుకు తరలిస్తున్న కృష్ణా జలాలను ఆదివారం నామాలగుండు సమీపంలో పరిశీలి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల కోసం సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి కృషి ఫలితంగా హంద్రీనీవా నీరు పులివెందుల వరకు చేరిందన్నారు. పులి వెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సమయంలో రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. దశాబ్దాల కల - మాజీ సీఎం జగన్ చేయలేనిపనిని కూటమి ప్రభుత్వం చేసి చూపిం చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నీటిని పరిశీలిస్తున్న జడ్పీటీసీ లతారెడ్డి

10న జరిగే సెమినార్‌ను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సెమినార్‌ను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం పింఛనర్స్ జిల్లా కార్యాలయంలో సెమినార్ కరపత్రాలు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక సేవ్ పబ్లిక్ సెక్టార్ ఆధ్వర్యంలో 10న యూటీఎఫ్ భవన్‌లో సాయంత్రం ఐదున్నర గంటలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు - ప్రభుత్వ రంగసంస్థలు విద్యా ప్రజారోగ్యం రంగాలపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్లు ఆవిష్కరణ కార్యక్రమంలో ఎల్ఐసీ యూనియన్ నాయకులు ఎ.రఘునాథరెడ్డి,యూటీఎఫ్, రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, పింఛనర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి, యూటీఎఫ్ నాయకురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘ జాతీయ సమావేశాలనూ...

కడప మారుతీనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 8, 9, 10 తేదీలలో తలపెట్టిన అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం జాతీయ సమావేశాలను దిగ్విజయం చేయాలని ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ వ్యవసాయ, కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడారు. ఈనెల 8వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కొత్త బస్టాండ్ సమీప అంబేడ్కర్ విగ్రహం వద్దనుంచి భారీ ప్రదర్శనగా పాత బస్టాండ్ చేరుకుని అక్కడి పూలే విగ్రహం వద్ద బహిరంగ సభ జరుగనుందన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష మండిపడ్డారు. ఆదివారం కడప నగరం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజలుమోసం చేస్తున్నారన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలతో కేటాయించిన 50సీట్లను కూడా ఈ కూటమి ప్రభుత్వం వెనక్కి ఇచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బసవరాజు, మల్లికార్జున,కిరణ్‌రెడ్డి, ప్రసాద్, అజ్మతుల్లా, పత్తి రాజేశ్వరి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు

కడప కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సాయంత్రం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగర రిమ్స్ సమీపంలోని శిల్పారామం సారస్కృతిక కళావేదికపై నగరానికి చెందిన కిశోర్ డ్యాన్స్ బృందం వివిధ సినిమా, జానపద గీతాలు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. శిల్పారామం పరిపాలనాధికారి క్రిష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా పౌర్ణమి దీపోత్సవం

వల్లూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీల్లో వెలసిన చౌడేశ్వరి మాత ఆలయాల్లో పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం దీపోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పూలు, నిమ్మకాయలు సమర్పించి అమ్మవారి ఎదుట దీపాలను వెలిగించి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దుగ్గాయపల్లెలోని చౌడేశ్వరిమాత ఆలయంలో జరిగిన దీపోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ జి.విశ్వనాథకుమార్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రవక్త జీవితం ఆదర్శనీయం

కమలాపురం రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రవక్త మహ్మద్ జీవితం సమస్త మానవాళికి ఆదర్శనీయమని మదీనా మస్జిద్ ఇమాం హజరత్ సయ్యద్ ఇమాంబాషా తెలిపారు. మీలాద్ ఉన్ నబీ మాసం సందర్భంగా ఆదివారం చిన్నచెప్పలిలోని మదీనా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో సీరతున్నబీ పోటీలు నిర్వహించారు. సుమారు 120 మంది పోటీల్లో పాల్గొనడం సంతోషదాయకమని అన్నారు. విజేతలకు ఈ నెల 10న బుధవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు కమిటీ సభ్యులు పోస్టర్లు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పొడదుర్తి మహబూబ్ బాషా, కె.సత్తార్, షరీఫ్, గఫార్, సత్తార్, అబ్దుల్ రసూల్, నాయబ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

పులివెందుల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి సహాయనిధి నుం చి మంజూరైన చెక్కుల ను ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశా రు. ఆదివారం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి నివాసంలో మాజీ సర్పంచు ఉమాదేవి దాదాపు 15 మందికి చెక్కులతో పాటు చికిత్సకు అవసరమైన ఎల్ఓసీలను అందేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆసరాగా ఉంటోందన్నారు. పార్టీలకతీతంగా ఈ సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మహేష్ పాల్గొన్నారు.

వెంకటరామిరెడ్డికి సేవారత్న అవార్డు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల టీడీపీ సీనియర్ నాయకుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డికి సేవారత్న అవార్డు లభించింది. ఆదివారం కడపలో ప్రజాసంకల్ప వేదిక రాయలసీమ జోనల్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో సేవా కార్యక్రమాలు చేపట్టిన పలువురికి సేవారత్న అవార్డులు అందించారు. ఈ సందర్భంగా పులివెందులలో టీడీపీ సీనియర్ నాయకుడుగా ఉంటూ రైతులకు, ప్రజలకు, విద్యార్థులకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతున్న వెంకటరామిరెడ్డికి రాష్ట్రస్థాయి సేవా రత్న అవార్డు దక్కింది. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డికి ప్రజాసంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ హైకోర్టు న్యాయవాది మదిరే రంగసాయిరెడ్డి అవార్డు అందించి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

'జీఎస్టీ పేరుతో ప్రజల రక్తం పీల్చారు'

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ 8 ఏళ్ల పాటు జీఎస్టీ పేరుతో ప్రజల రక్తం పీల్చి ఇపుడు మినహాయింపులని చెప్పడం విడ్డూరమని పీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్ మండిపడ్డారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు.

గంజాయికి అడ్డాగా వాటర్‌ట్యాంకు..!

కడప క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం రిమ్స్ పవర్ స్టేషన్ పరిధిలోని చలమారెడ్డిపల్లెపైనున్న వాటర్ ట్యాంకు కొండపై గంజాయిరాయుళ్లకు అడ్డాగా మారింది. ఆదివారం శంకరాపురం, రవీంద్రనగర్‌కు చెందిన పది మంది యువకులు వాటర్‌ట్యాంకు కొండ వద్దకు వెళ్లారు. చలమారెడ్డిపల్లెకు చెందిన ముగ్గురు యువకులు అక్కడే మద్యం తాగుతుండగా గంజాయి బ్యాచ్ వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో మద్యం, గంజాయి తాగుతున్న పలువురు యువకులు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో గంజాయి బ్యాచ్ ఇద్దరిని బీర్‌బాటళ్లతో దాడి చేశారు. దీంతో ఆ యువకులు సమీపంలో ఉన్న వారి బంధువులకు సమాచారం ఇవ్వడంతో అక్కడ నుంచి కొంత మంది పరారు కాగా, మిగిలిన వారిని ఆ గ్రామస్థులు పట్టుకున్నారు. రిమ్స్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టవా?

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టవా అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆదివారం ఉదయం కడపనగరం యూటీఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల విధానాల్ని ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ట్రెజరర్ బి.రాజశేఖర్ రాహుల్, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాతరాణి, ట్రెజరర్ కె.నరసింహరావు, జిల్లా కార్యదర్శులు కె.చెన్నయ్య, చెరుకూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రహణం సందర్భంగా ఆలయాలు మూసివేత



మూతవేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డులోని నాగేశ్వరాలయం

చెన్నూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చంద్ర గ్రహణం సందర్భంగా మండలంలోని అన్ని ఆలయాలు ఆదివారం మధ్యాహ్నమే మూసివేశారు. చెన్నూరులో ప్రధాన ఆలయాలైన మల్లికార్జునస్వామి ఆలయం, నాగేశ్వర ఆలయం, రామలింగ చౌడేశ్వరి ఆలయం, సీతారామ సంకీర్తన క్షేత్రంతో పాటు వీరాంజనేయ, అభయాంజనేయ ఆలయాలు మూసివేశారు.అలాగే ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం పూజలు నిర్వహించిన అనంతరం 10గంటలకే ఆలయాలు మూసివేయడం జరిగింది.

పరిశుభ్రత పెంపొందించడమే లక్ష్యం



శ్రీనివాసులరెడ్డి
మున్సిపల్ కమిషనర్, మైదుకూరు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణంలో పరిశుభ్రత పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మైదుకూరు మున్సిపల్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఇందుకు ప్రజల సహకారం అవసరమని 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

పశ్న: మున్సిపాలిటీలోని ప్రధాన సమస్యలు ఏమున్నాయి ?

జవాబు: మైదుకూరులో ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు సమస్యలున్నాయి.

పశ్న: పారిశుధ్యంపై మీరు తీసుకొంటున్న జాగ్రత్తలు ఏంటి ?

జవాబు: పారిశుధ్య సిబ్బంది ప్రతి రోజు ఉదయాన్నే వీధుల వద్ద ఉండే చెత్త కుండీలను శుభ్రం చేసి పట్టణంలో పరిశుభ్రతను పెంపొందిస్తున్నాం.

ప్రశ్న: నీటిసమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు?

జవాబు: తాగునీటి విషయంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పంపు ఆపరేటర్ల ద్వారా బోర్ల వద్ద నుంచి పట్టణం అంతా నీటిని అందిస్తున్నాం.

పశ్న: కుక్కలు, కోతుల బెడదలకు ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు ?

జవాబు: స్పెషల్ టీమ్ ద్వారా సమస్యను పరిష్కరిస్తున్నాం.

పశ్న: మైదుకూరు మున్సిపాలిటీలో ఎన్ని వార్డులు ఉన్నాయి ?

జవాబు: మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు ఉన్నాయి. అన్ని వార్డుల అభివృద్ధి పరచడానికి కృషి చేస్తున్నాం.

పైపులైన్లు పూర్తయ్యేదెన్నడో..?

- రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా దెబ్బతిన్న పైపులైన్లు
- తాగునీరు అందేదెన్నడు
- నిరుపయోగంగా ఓవర్ హెడ్‌ట్యాంకు



దెబ్బతిన్న పైపులైను పరిశీలిస్తున్న సర్పంచ్ యనమల సుధాకర్ (ఫైల్)



నర్సింగపల్లె వద్ద పైపులైను కోసం తవ్విన గుంత

పోరుమామిళ్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పైపులైన్లు దెబ్బతిన్నాయి. దీంతో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నీటి ఎద్దడి ఎక్కువ ఉన్న సమయంలో పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లోని ప్రజల దాహార్తి తీర్చేందుకు దిగువ సగిలేరు వద్ద బోర్లు వేసి అక్కడ నుంచి ఆ రెండు పంచాయతీలకు పైపులైన్లు ఏర్పాటు చేశారు. రంగసముద్రం పంచాయతీకి సంబంధించి రూ.40లక్షలు పోరుమామిళ్లకు సంబంధించి రూ.50లక్షల నిధులతో ఈ పనులు పూర్తి చేసి ఆయా ప్రాంతాలకు వాటర్‌కనెక్షన్ ఇచ్చారు. కానీ గత ఏడాది నుంచి పోరుమామిళ్ల రోడ్డు విస్తరణ పనుల్లో పైపులైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఫోర్‌లైన్ నిర్మాణం చేపట్టేవారు సుమారు రూ.70లక్షల వ్యయంతో సగిలేరు నుంచి నరసింగపల్లె వరకు పైపులైను నిర్మాణం చేపట్టారు. అక్కడ నుంచి రంగసముద్రంకు, పోరుమామిళ్లకు నీరు అందాలంటే ఈ పైపులైన్ల మరమ్మతులు కూడా జరగాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఆ ప్రస్తావనే ఎవరూ తేలేదు. గతంలో ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మించి ఈ పైపులైన్ల ద్వారా అందుకు నీరందించి పోరుమామిళ్ల నుంచి ఎత్తయిన ప్రాంతాల్లో ఉన్న వీధులకు నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. అంతేకాక పక్కన సంప్ కూడా నిర్మించారు. కానీ ఈ రోడ్ల విస్తరణ కార్యక్రమంలో అవి నిరుపయోగంగా మిగిలాయి. పోరుమామిళ్లకు సంబంధించి పంచాయతీ కార్యాలయం వరకు వేసిన పైపులైన్లకు సంబంధించి పైపులన్నీ బయటపడ్డాయి. మహాత్మాగాంధీ విగ్రహం సర్కిల్‌లో ఉన్న వాల్వ్ మొత్తం పూడిపోవడంతో నెలరోజులకు పైగా వాసవీనగర్, కొత్తవీధి, బెస్తవీధి ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురైన సమయంలో సర్పంచ్ యనమల సుధాకర్ ట్యాంకర్లతో నీళ్ల సరఫరా చేయించారు. పోరుమామిళ్లలో దాదాపు 16వేల మంది జనాభా ఉన్నారు. రంగసముద్రం పంచాయతీకి వచ్చేసరికి దాదాపు పదివేల వరకు జనాభా ఉంటారని అంచనా. వారందరికీ తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో గతంలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాలు దెబ్బతినడంతో తాగునీటికి కాస్త ఇబ్బంది కలుగుతుంది. ప్రస్తుత పాలకులు ప్రత్యామ్నాయంగా తాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితేఈ రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో అవి పూర్తి ఎప్పుడు అవుతాయి నీరెపుడందుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోరుమామిళ్లలో ముఖ్యంగా కొత్తవీధి, ఓల్డ్ పోస్టాఫీసు వీధి, మిగిలిన ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తుతూనే ఉంది. ఈ పైపులైన్లు పునరుద్ధరించి తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏమన్నారంటే: ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఫోర్‌లైన్‌కు సంబంధించిన కాంట్రాక్టర్లు సగిలేరు నుంచి నర్సింగపల్లె వరకు పైపులైను నిర్మాణం చేటప్టార న్నారు. పోరుమామిళ్ల రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి సంబంధిత అధికారులకు రూ.50 లక్షల వరకు అంచనాలు వేసి ప్రతిపాదనలను పంపామన్నారు. కానీ ఇప్పటికి వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, రోడ్డు విస్తరణ పనులతో పాటు ఈ పైపులైనుకు నిధులు కూడా వారు కేటాయిస్తే దెబ్బతిన్న పైపులైన్లు పునరుద్ధరించడం జరుగుతుందన్నారు.

నారాపుర వేంకటేశ్వర ఆలయం మూసివేత



జమ్మలమడుగు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా జమ్మలమడుగులోని శ్రీనారాపుర వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మధ్యాహ్నం 12.35 గంటలకు నుంచి మూసివేశారు. చంద్రగ్రహణం రాత్రి 9.58 గంటలకు ప్రారంభం కానుండడంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారుల ఆదేశాల మేరకు ఆలయాన్ని మూసివేశారు. అలాగే పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గల వేంకటేశ్వరస్వామి ఆలయం, కన్నెలూరు, నాగులకట్టవీధి, మోరగుడి, తదితర గ్రామాల్లో అన్ని ఆలయాలు మూతపడ్డాయి. సోమవారం ఉదయం శ్రీ నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుద్ధి చేసి తిరిగి ఉదయం 7 గంటలకు భక్తుల దర్శనం ప్రారంభం అవుతుందని ఆలయ అధికారులు తెలియజేశారు. అలాగే మిగతా దేవాలయాలు సైతం దర్శనం సోమవారం ఉదయం నుంచి మామూలుగా ఉంటుందని ఆలయాల నిర్వాహకులు తెలియజేశారు.

సంజీవరాయ స్వామి ఆలయం...

రాజుపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ్య పుణ్యక్షేత్ర మైన వెల్లాల సంజీవరా యస్వామి ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మూసివేసినట్లు ఆలయ అర్చకులు శేషాచార్యులు, మాధవాచార్యులు , పవనాచార్యులు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయం శుద్ధి చేసి మళ్లీ భక్తులకు దర్శనం కలిగే విధంగా చేస్తున్నామని వారు తెలిపారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయం ...

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగహణం పురష్కరించుకుని శివాలయం తలుపులు మూసివేశారు. ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించారు. 4 గంటల నుండి సోమవారం తెల్లవారుజామున 5 గంటల వరకు తలుపులు మూసివేశారు. అయిదు గంటలకు స్వామివారికి శుద్ధి, పుణ్యఆవచణం, మహానివేదన, అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈవో వెంకటసుబ్బయ్య, తెలిపారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్

జమ్మలమడుగు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలలో డీఏ, ఐఆర్‌లపై వెంటనే ప్రకటన చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగులోని ఎస్టీయూ రీజియన్ కార్యాలయంలో ఆ సంఘం ఉపాధ్యాయులు, నేతలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి అంతలోపల ఐఆర్ ప్రకటించాలని కోరారు. బదిలీ పొందిన స్కూల్ అసిస్టెంట్లను అందరిని రిలీవ్ చేయాలని, ప్రస్తుతం జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 700 మంది దాకా ఖాళీలు ఉన్నాయని ఈ డీఎస్సీ ద్వారా 235 భర్తీ అవుతున్నాయని, మిగిలిన వాటిని అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించి బదిలీ పొందిన ఉపాధ్యాయులందరిని రిలీవ్ చేయాలని కోరారు. 10వ తరగతి మూల్యాంకణం సందర్భంగా రావాల్సిన బకాయిలు అయిదు నెలలు అయినప్పటికి ఇంతవరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ మధ్యలోనే ప్రభుత్వ పాఠశాలల నుంచి స్కూల్ అసిస్టెంట్లను మండల విద్యాశాఖ అధికారులను నియమించారని, వాటి స్థానంలో సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులను నియమించలేదన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రీజియన్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా సాంకేతికకమిటీ కన్వీనర్ మహ్మద్ గౌస్, రీజియన్ కోకన్వీనర్ వెంకటేశ్వర్లు, మండలాలకు చెందిన అధ్యక్షులు ఉపేంద్ర, శివరాం, దామోదర్‌రెడ్డి, గౌస్‌నూర్, లక్షుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ మల్హోత్రను కలిసిన మున్సిపల్ చైర్మన్



మల్హోత్రను కలిసి సత్కరించిన మున్సిపల్ చైర్మన్ చంద్ర

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏపీ ఇండ స్ట్రియల్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ డైరెక్టర్ పందిటి మల్హోత్రను మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర కలిశారు ఈ సందర్భంగా ఆయనను పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో షౌకత్‌అలి, అక్బర్, మాచనూరు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు ఇలా.. మరి శుభ్రత ఎలా?



కాలువల్లో నిండిన వ్యర్థాలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని తాడిపత్రి రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ కాలువలు వ్యర్థాలతో నిండి ఉన్నాయి. అలాగే పెద్దపసుపులమోటు, నాగులకట్టవీధి, తేరు రోడ్డు కంపుకొడుతోంది. శ్రీ నారాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయం ఎదురుగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా కాలువ నిండా వ్యర్థాలు ఉన్నాయి. కొన్ని చోట్ల డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయక మట్టితో నిండి ఉన్నాయి. అలాగే పలగాడివీధి సెంటర్, అంబాభవానీ దేవాలయం వీధి వెళ్లే రోడ్లలో పరిస్థితి దారుణంగా ఉంది. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సంబందిత అధికారులు దోమల నివారణకు ముందుగా చెత్త, వ్యర్థపదార్థాలు శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఁజమ్మలమడుగు మున్సిపాలిటీ గ్రేడ్-3గా మారినా సమస్యలు తిష్టవేశాయని ప్రజలు వాపోతున్నారు.

దూదేకుల పొలిటికల్ జేఏసీ జిల్లా కార్యదర్శిగా సిద్దు

ముద్దనూరు సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నూర్‌బాషా ముస్లిం దూదేకుల పొలిటికల్ జేఏసీ జిల్లా కార్యదర్శిగా ముద్దనూరు మండలం ఉప్పలూరుకు చెందిన ఓతూరు సిద్దును నియమించారు. జేఏసీ జనరల్ సెక్రటరీ మహబూబ్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు.

మట్కా బీటర్ల అరెస్టు

దువ్వూరు,ర సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఇడమడకలో మట్కా పట్టీలు రాస్తున్న సిద్దయ్య, బ్రహ్మం అనే వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వీరి వద్ద రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే బైపాస్ రహదారి పక్కన మద్యం తాగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా చండీ హోమం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం లోకకల్యాణార్థం వేద పండితులు గోపూజ, చండీహోమంను శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పండితులు, వేద పాఠశాల గురువు వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ పోటీలు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-18, 20 స్త్రీ, పురుషులకు 100, 200, 400, 800 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన 20 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వారు ఈనెల 26, 27 తేదీల్లో వేలూరులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శివారెడ్డి, నాగేశ్వరరావు, దిలీప్, రాఘవ, అఖిల, ఖాదర్‌రెడ్డి, బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

మాలలపై దాడి చేయడం దారుణం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న మాలమహానాడు నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కైకలూరులో మాలలపై జనసేన పార్టీ నాయకులు దాడి చేయడం దారుణమని రాష్ట్ర మాలమహానాడు రామోజీ వర్గం జాతీయ అధ్యక్షుడు రామోజీ ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం జనసేన పార్టీ నాయకుల దాడులకు పాత బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల, ఎస్సీలపై దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. అణగారిన వర్గాలపై విచక్షణా రహితంగా కొట్టి హింసించడం దారుణమన్నారు. దీనిపై హోంమంత్రి స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓబులేసు, అరుణ్‌కుమార్, పుల్లయ్య లక్షుమయ్య, నారాయణ, రత్నం, శేఖర్, పాల్గొన్నారు.

రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డు గ్రహీతలకు సన్మానం



రాష్ట్ర, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఏపీటీఎఫ్ కార్యాలయంలో సన్మానిస్తున్న సంఘం నేతలు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఏపీటీఎఫ్ -257 ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయలో పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, బిమఠం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి అవార్డులు దక్కించుకునేందుకు వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవంలో అవార్డు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించుకోవడం కోసం ఈకార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వారంతా రావేవు కాలంలో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు పొందాలని సభాధ్యక్షుడు ఎస్‌ఏ సత్తార్ కోరారు. పిల్లల భవిష్యత్ తీర్చిదిద్దే మహత్తర బాధ్యతను తీసుకుని అత్యంత గౌరవ స్థానంలో ఉండేవారు ఉపాధ్యాయులని ఎంఈవోలు కొండిశెట్టి, రఫి, రాజశేఖర్‌రెడ్డి, నిర్మల పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు సురేంద్రనాధరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జిల్ల ఉపాధ్యక్షులు రమణారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, సుబ్బయ్య, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం



ఈద్గా మైదానంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే వరద, అంజుమన్ అధ్యక్షుడు ముక్తియార్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటడం వలన ప్రకృతితో పాటు పర్యావరణం పరిర క్షించబడుతుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో అంజుమన్ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వరదరాజురెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థనా స్థలాల్లో మొక్కలు పెంచడం వలన భక్తులు కూడా ఆహ్లాదకర వాతావరణంలో ప్రార్థనలు చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో అంజుమ న్ అహలే ఇస్లాం అధ్యక్షుడు వీఎస్ ముక్తియార్, కార్యదర్శి ఇలియాస్, ఉపాధ్యక్షుడు మహమూద్, మాజీ అధ్య క్షుడు బాష, ఖలీల్, ఖాదర్‌వలీ, మున్నా,నజీర్ పాల్గొన్నారు.

వంద టన్నుల యూరియా మంజూరు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రైవేటు డీల ర్లకు, రైతు సేవాకేంద్రాలకు 100.2 టన్నుల యూ రియా మంజూరైనట్లు ఏడీఏ మురళీ ధర్‌రెడ్డి, ఏవో చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ అవసర మైన రైతులు యూరియా పొందవచ్చని ఎవరైనా యూరియాను కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే యూ రియా ను విక్రయించాలన్నారు. మూడు రైతు సేవాకేంద్రాలకు 21 టన్నులు, 79.2 టన్నులు ప్రైవేటు డీలర్లకు కేటాయించినట్లు వారు తెలిపారు.

నేటి నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

కలసపాడు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారెడ్డిపల్లెలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. మేరీమాత ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండవ బహుమతిగా రూ.5 వేలు, మూడవ బహుమతిగా రూ.3 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.